# జైలు కథలు 5

## సుశీల

"జైలర్‌సాబ్ బులారే."

"అబీ ఆయా....ఆప్ జాయియే...."

నేను ఇచ్చిన సమాధానం. విని వెళ్ళాడు. షర్టు వేసుకొని జైలర్‌గారి ఆఫీసుముందుకు వచ్చాను. బయట నిండుగా పైటచెంగు కప్పుకొని వుందొక స్త్రీ. "గుడ్ మార్నింగ్ సార్" విష్ చేశాను.

"వెరీ గుడ్‌మార్నింగ్ ప్రసాద్" నాచేతికి ఒక తెల్లకాగితం అందించారు. దానిపై అతని సంతకం వుంది. "బయట ఒక ఆడమనిషి వుంది. ఆమె ఏదో అర్జీ వ్రాసుకోవాలిట.... కాస్త సాయం చెయ్యి" మనిషి గంభీరంగావున్నా మా జైలరు మనసు మాత్రం సున్నితం. చాలా మంచి వ్యక్తి.

బయటకు వచ్చి "రామ్మా" అన్నాను. ఆమెనన్ను అనుసరించింది. ప్రక్కన బావి అంచునే వున్న బాదం చెట్టు నీడలోకి నడిచి కూర్చున్నాను. ఆమె కూర్చుంది. వయసు 22 సంవత్సరాల లోపునే వుంది. ముఖం విచారంతో వాడిపోయి వుంది. చెప్పటం మొదలుపెట్టింది.

మహబూబ్‌నగర్ దగ్గరలో వున్న పువ్వాడ గ్రామం సుశీల నివాసం. పెండ్లయి ఐదు సంవత్సరాలు కావస్తున్నా సంతానం లేదు. భర్త మంచివాడే అయినా వయసు తొందరలో ఇంటి ఎదురుగా వుంటున్న సుబ్బయ్యతో అక్రమ సంబంధం కలిగి వుంది సుశీల.

కామానికి కళ్ళులేవంటారు. అతని కల్లబొల్లి మాటలకు లొంగిపోయి భర్తనువదలి గుంటూరు వద్దనున్న కాకానికి వెళ్ళిపోయింది సుబ్బయ్యతో. భార్యాభర్తలం అని చెప్పుకొని, కాయకష్టం చేసికొంటూ కాలం



గడుపుతున్నారు. సుబ్బయ్య బాగా పాడగలడు. అందువల్ల సాయంకాలం ఆ గ్రామంలో వున్న చాలా మంది వీళ్ళగుడిసె వద్ద చేరేవాళ్ళు. స్త్రీలు కూడా వచ్చి వినేవాళ్ళు. వాళ్ళలో ఒకతె నరసమ్మ. కాలం గడచిపోతోంది. కాని సుశీలను మాత్రం కష్టాలపాలు చేస్తూంది. సుశీలను ప్రతి చిన్న విషయానికి, ఒకోసారి కారణం లేకపోయినా కొట్టడం ప్రారంభించాడు సుబ్బయ్య. అయినా ఓర్చుకుంది. ఒకోసారి పనివున్నా వెళ్ళకుండా గుడిసెలోనే వుండిపోయేవాడు. అయినా పట్టించుకోలేదు సుశీల. ఇరుగు పొరుగువారు చెప్పారు. ఆమె లేని సమయంలో నరసమ్మ వస్తూందని విషయాన్ని గ్రహించలేని అవివేకి కాదు సుశీల. అయినా అబల. అందునా స్త్రీ. సహించింది.




ఆ రోజు మిరపచేలో కలుపుకు వెళ్ళింది సుశీల. మధ్యలో వాన రావడంవల్ల పని సాగలేదు. తిరిగివచ్చిన సుశీలకు గుడిసెలో జరుగుతున్న పని చూడగానే కండ్లు నిప్పులు వర్షించాయి. అబల సబలగా మారింది. స్త్రీ ఆదిశక్తిగా రూపొందింది. ఆ సమయంలో ఆమెను గమనించే స్థితిలో లేరు నరసమ్మ, సుబ్బయ్య. వారికది గుడిసె కాదు—స్వర్గలోకధామమే అయింది. ఈ లోకాన్ని వదలి స్వర్గంలోనే విహరిస్తున్నారు. సుశీల ఆలోచించటం మానేసింది. చేతిలోవున్న కొడవలితో తలపై గట్టిగా మోదింది. తల పగిలి రక్తం చిమ్మింది. కాని ఆ రక్తం సుశీల కన్నులలోవున్న ఎర్రదనాన్ని మించలేకపోయింది. అంతే.... దెబ్బపై దెబ్బ ఎన్ని వేసిందో ఆమెకు తెలియదు. సుబ్బయ్య ప్రాణం పోయింది కూడా తెలియదు.

తరువాత కథ మామూలే. కేసు, అరెస్టు. కాని సుశీల జామీను కొరకు ప్రయత్నిస్తున్నాడు భర్త కోటేశు. కోటేశుకు జోహారు అర్పించాను మనసులో.

—ప్రసాద్